

# ఒక ఒరలో రెండు కత్తులు

**- సులోచన**

అశ్వని పెళ్ళయి అత్తగారింటికి కాపురానికి వెళ్ళింది. అత్తగారు, భర్త చాలా మంచి వాళ్ళు అనుకునేది.

అశ్వనికి తండ్రేగాని తల్లి లేదు. అశ్వనికి నాలుగేళ్ళ వయస్సులోనే తల్లి లేని పిల్ల అయింది. తండ్రి వెంకట్రామయ్యే పెంచి పెద్ద చేసాడు అశ్వనిని.

కూతురుకు పెళ్ళి చేస్తే తన బాధ్యత నెరవేరుతుంది. ఆ తర్వాత ఎలాగైనా ఫరవాలేదని అశ్వనికి పెండ్లి చేశాడు. వెంకట్రామయ్యకు తాతల నాటి యిల్లు వుంటే అమ్మి అశ్వనికి పెండ్లి చేసి, మిగిలిన డబ్బు అశ్వని పేర బ్యాంకులో వేసాడు.

అశ్వనిని భర్త, అత్తగారు అపురూపంగా చూసుకుంటున్నారు. తనెంత అదృష్ట వంతురాలో అని పొంగిపోయింది.

అశ్వని కాపురానికి వచ్చి నెల తిరక్కముందే ఆమె తండ్రి చనిపోయాడు.

తనకున్న ఒక్క అండ కూడా పోయిందని కుమిలి కుమిలి ఏడ్చింది అశ్వని.

అశ్వనికి తండ్రిపోవటంతో మొదలైనాయి కష్టాలు. చీటికిమాటికి విసుక్కుంటున్నది సుబ్బా యమ్మ. ఇంటి పనులు వంట పనులు అన్నీ అశ్వని నెత్తిన పడ్డాయి.

"ఎప్పుడు ఏడుపు ముఖంతో వుంటావు. నీ ముఖం చూడాలంటేనే నాకు విసుగ్గా వుంది" అనటం మొదలు పెట్టాడు ఆనంద్.

నిస్సహాయంగా వుండిపోయింది అశ్వని. భర్త అత్తగారు మారేటట్టు లేరు. అదే చింతతో తిండికి, నిద్రకు దూరమైంది.

"ఏమిటి! మీ కోడలు అలా చిక్కిపో తోందని" యిరుగు పొరుగు అంటూటంటే సుబ్బా యమ్మ "తండ్రి పోయాడని అలా తయారవుతోంది. యిదే మన్న సబబుగా వుందా?" అని బుగ్గలు నొక్కుకుంటుంది.

భర్త ఆనంద్‌కు, అశ్వనికి మధ్య అగాధం ఏర్పడింది. అశ్వని గాలి సోకినా చికాకుపడు తున్నాడు ఆనంద్.

ఆనంద్ తన తోటి వుద్యోగిని రోహిణికి వల పన్నాడు. ఆవలలో చిక్కింది బంగారు చేపలాగా రోహిణి. ఇద్దరూ రిజిస్టర్ మ్యారేజి చేసుకున్నారు.

ఆనంద్ మళ్ళీ పెళ్ళి చేసుకున్నడన్న విషయం తెలిసి నిర్లిప్తంగానే వుండిపోయింది. అశ్వని మనసు ఏ అలజడికి లోంగలేదు. పనిమనిషికి వంట మనిషికి ఎలాంటి స్థానం వుంటుందో అలాంటి జీవితం యాంత్రికంగా గడుపుతున్నది అశ్వని.

రోహిణిని యింటికే తీసుకొనివచ్చాడు ఆనంద్. రోహిణి కంటపడలేదు అశ్వని. భోజనానికి అన్నీ అమర్చి పక్కకి తప్పుకుంటున్నది.

రోహిణి, ఆనంద్ కలిసి కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుకుంటూ తింటున్నారు. గొంతు ఎక్కడో విన్న ట్లుగా అనిపించి తోంగి చూసింది అశ్వని. దీనినా పెళ్ళి చేసుకున్నది? అనుకుంది మనస్సులో.

ఒకరోజు అనుకోకుండా రోహిణి అశ్వని ఎదురు పడ్డారు. రోహిణి ఆశ్చర్యానికి అంతులేదు.

"ఏంటే నువ్విక్కడున్నావు" అంది రోహిణి ఆశ్చర్యంగా.

"నీలాగే వచ్చాను నేను" అంది కళ్ళ నీళ్ళతో అశ్వని.

"అయితే ముందు నిన్ను తరువాత నన్ను చేసుకున్నాడన్న మాట" అని ముని పంటితో పెదవి కొరుక్కుంటూ.

"వస్తున్నారాయన" అని తప్పుకుంది అశ్వని.

రోహిణి ఆనంద్‌తో ముభావంగా ఉంటున్నది. ఆనంద్ బ్రతిమాలాడు.

"నువ్వు అలావుంటే నాకు చెప్పలేనంత బాధగా

వుంది. ఎందుకు అలా వున్నావో కారణం చెప్పు" అన్నాడు బ్రతిమాలే ధోరణితో.

"నన్ను విసిగించకండీ" సమయం వచ్చిన ప్పుడు నేనే చెబుతాను." అంది చిరాగ్గా రోహిణి.

ఒక రోజు ఆనంద్ క్యాంపుకు వెళ్ళాడు. రెండు రోజుల దాకా రానని చెప్పి. సుబ్బాయమ్మ హరి కథకు వెళ్ళింది. అశ్వని, రోహిణి ఒంటరిగా వున్నారు. అశ్వని కళ్ళు మూసుకొని పడుకుంది నిద్ర రాకపోయినా.

రోహిణి అశ్వని మంచం దగ్గరకు వచ్చి అశ్వని పక్కలో కూర్చుంది. కళ్ళు తెరిచి చూచిన అశ్వని

"ఏంటి రోహిణి వచ్చావు" అంది.

"నా మీద కోపమా?" అడిగింది రోహిణి.

"నీ మీద నాకెందుకే కోపం నేనిప్పుడు ఎవరి మీద కోపం తెచ్చుకొనే స్థితిలో లేను. పేదవాని కోపం పెదవికి చేటు." అంది అశ్వని.

ఆనంద్‌కు యింతకు ముందే పెళ్ళయిన సంగతి నాకు తెలీదు. "నేను మీ యిద్దరికీ మధ్య అడ్డు గోడగా వుండదల్చుకోలేదు" అంది ఆవేశంగా.

"నీ మూలంగా మాకే అడ్డుగోడ లేదు". మా యిద్దరి మధ్య ఏనాడో అడ్డుగోడ ఏర్పడింది.

"అదేం"

"పెళ్ళయిన దగ్గరి నుంచి అన్నీ విషయాలు పూస గుచ్చినట్టు చెప్పింది అశ్వని. రోహిణి కన్నీళ్ళతో.

"నువ్వు వచ్చినప్పటి నుంచి నాకు కొంచెం హాయిగాటంటోంది. పనిలో చేదోడు వాదోడుగా వుండటంతో కొంచెం తెరిపిగా వుంది" అంది అశ్వని.

"చిన్నప్పుడు మనం ఎంత స్నేహంగా వుండే వాళ్ళం. ఒకే కంచంలో తిని, ఒకే మంచంలో పడు కునే వాళ్ళం. మన వాళ్ళంతా ఎగతాళి చేసేవారు గుర్తుందా! అంది. రోహిణి చిన్న నాటి జ్ఞపకాలు జ్ఞప్తికి తెచ్చుకుంటూ.

"ఇద్దరూ ఒకడినే పెళ్ళి చేసుకుంటే మీ యిద్దరికీ ఎడబాటు ఉండదు అనే వారు కదా చూసేవారు! అదే నిజమయింది" అంది అశ్వని. అన్నీ మర్చిపోయి నవ్వుతూ.

"మనిద్దరం ఒకరి కోసం ఒకరుగా ఉండాలి. అంతేగానీ నాకు నువ్వు నీకు నేను అడ్డుగోడ" అనుకోకూడదు. రేపటి నుంచి నా తడాఖ ఏమిటో చూపిస్తాను అంది ఛాలెంజ్ చేస్తున్నట్లు రోహిణి.

నవ్వి వూరుకుంది అశ్వని. అశ్వని, రోహిణి ఆ రాత్రికి హాయిగా నిద్రపోయారు.

మర్నాడు ఉదయం అశ్వని ఏడుగంటలైనా లేవలేదు. రోహిణి లేచి అటూ యిటూ పచార్లు చేస్తున్నది.

సుబ్బాయమ్మకు ఆరుగంటలకే కాఫీ చేతికి అందివ్వాలి అశ్వని. దానికి విరుద్ధంగా అశ్వని లేవలేదు.

"ఒసేవ్ ! లే ! అంత మొద్దు నిద్రేమిటి టైం ఏడుగంటలైంది తెలుసా ! ఏం చూసుకొనో ఆ మిడిసి పాటు" అని రంకెలేస్తూన్నది సుబ్బాయమ్మ అశ్వని మీద.

"జ్వరం వచ్చి అశ్వని పడుకుంటే మీరు కాఫీ పెట్టలేరా?" అని అడిగింది రోహిణి.

"ఏవి ఎక్కడ వున్నాయో నాకు తెలీదు. అయినా దానికి జ్వరం వస్తే నేను పెట్టాలా?" అంది సుబ్బాయమ్మ.

"ఇక నుంచి అశ్వని ఏపని చేయదు. మీరే అన్నీ చూసుకోండి" అని విసురుగా యివతలకు వచ్చేసింది.

రోహిణిని చూస్తే జంకుతుంది సుబ్బా యమ్మ.

"అశ్వని ఒక్కనాడు నోరెత్తి మాట్లాడలేదు. దీనికి సంపాదిస్తున్నానని పొగరు" అనుకుంది.

ఆఫీసుకు వెళుతున్నప్పుడు ఒక రోజు ఆనంద్‌కు యాక్సి డెంట్ అయింది. మూడు నెలలు సెలవు పెట్టి ట్రీట్‌మెంట్ తీసుకుంటున్నాడు. రోహిణి ఒక్కదాని సంపాదనతో యిల్లు గడవటం కష్టమైంది.

రోహిణి, అశ్వని అన్యో న్యంగా వుండటం ఆనంద్, సుబ్బాయమ్మలకు ఆశ్చర్యం కలిగించింది.

రోహిణి ఆఫీసుకు వెళుతుంటే అశ్వని భర్తకు కావ లసినవన్నీ చూసుకుంటున్నది.

అశ్వని, ఆనంద్‌లు మళ్ళీ సన్నిహితులైనారు.

"నన్ను క్షమించు అశ్వని. నిన్ను ఎన్నో విధాలుగా బాధ పెట్టాను." అన్నాడు దుఃఖం పూడుకు పోయిన కంఠంతో.

"మీరలా వుండబట్టే నా స్నేహితురాలు నాకు దగ్గరైంది." అంది అశ్వని.

"ఏంటి రోహిణి నీ స్నేహితురాలా." మరి యిన్నాళ్ళు ఆ విషయం నాకు చెప్పలేదేమి" అన్నాడు ఆనంద్ ఆశ్చర్యంతో.

"అవును నా స్నేహితురాలే" అంది గర్వంగా.

"నాకే కాలు ఎప్పటికి సరి అవుతుందో ఎన్నాళ్ళిలా యింట్లో వుండి డబ్బుకు ఇబ్బంది పడాలో" అన్నాడు సాలోచనగా.

"డబ్బుకు యిబ్బంది ఏమి పడక్కరలేదు లెండి" అంది అశ్వని అతనినే చూస్తూ.

"ఈ నెల నుంచి కష్టమే అశ్వని"

"మా నాన్న నా పేర్న వేసిన డబ్బు బ్యాంకులో వుంది అది వాడుకుందాము లెండి మీరేమీ బాధ పడకండి" అంది లాలనగా.

"అశ్వని నీ వెంత మంచి దానివి. నీవు దేవతవు అశ్వని.... నువ్వు దేవతవు" అన్నాడు మాటలు రాని వాడిలా.


"అంత మాట వద్దు లెండి" అంది సిగ్గుగా.

అశ్వని చేతిని ప్రేమగా నొక్కాడు ఆనంద్.

రోహిణి, అశ్వనికి నాలుగు సంవత్సరాలలో ఇద్దరు బిడ్డలు పుట్టారు. అశ్వనిని, రోహిణిని రెండు కళ్ళుగా చూసుకొంటున్నాడు ఆనంద్. సుబ్బాయ మ్మలో అత్తగారి లక్షణాలు తగ్గి యిద్దరు కోడళ్ళతో ఆనందంగా వుంది.

చుట్టు ప్రక్కల వాళ్ళంతా ఆశ్చర్యంతో నోరెళ్ళ బెడుతున్నారు. ఒక ఒరలో రెండు కత్తులు యిమడవు కదా! మరి వాళ్ళు అది నిజం కాదని నిరూపించారు అనుకున్నారు చూసిన వాళ్ళు. ❋

## అదిగో టైటానిక్



టైటానిక్ చిత్రం సూపర్ డూపర్ హిట్ అయ్యాక, బాలీఫీల్డ్ అనే స్పోర్ట్స్ కంపెని అధినేత దీన్ని రూపొందించాడు. అయిదు నిముషాల్లో గాలితో పొంగేలా చేసే ఈ రబ్బరు ఓడ పొడవు 55 అడుగులు, ఎత్తు 35 అడుగులు, వెడల్పు 21 అడుగులు. 48 డిగ్రీల కోణంలోంచి పైనుంచి ప్రయాణీకులు కిందకి జారడం థ్రిల్లింగ్‌గా వుంటుంది. 550 కిలోల బరువుండే ఈ రబ్బరు ఓడలో గాలి తీసేసి, 50 అంగుళాల చతురస్రంగా మడచవచ్చు. 'టైటానిక్ సూపర్ ఫ్లైయిర్' అనే పేరుగల దీన్ని అమెరికాలో కార్నివాల్స్ జరిగేచోటుకి తీసుకెళ్తున్నాడు బాలీఫీల్డ్. దీనికి గిరాకీ బానే ఉంది.